



# నది కింద 10 మీటర్ల లోతున మెట్రో స్టేషన్

● అడయార్ స్టేషన్‌కు చేరుకున్న 'కావేరి' యంత్రం




కావేరి యంత్రానికి స్వాగతం పలుకుతున్న సీఎంఆర్ఎల్ అధికారులు

పెరంబూర్, సెప్టెంబరు 20: చెన్నై మెట్రోరైలు రెండో విడతలో చేపట్టిన మూడో మార్గంలో పనులు చకచకా జరుగుతున్నాయి. 'కావేరి' యంత్రం సొరంగం తవ్వకాలు పూర్తిచేసి అడయార్ స్టేషన్‌కు చేరుకుంది. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) తన ఎక్స్ పేజీలో ఈ విషయాన్ని పోస్ట్ చేసింది. మెట్రోరైలు రెండో విడతలో మొత్తం మూడు మార్గాల్లో 116.1 కి.మీ మేరకు మార్గం ఏర్పాటవుతోంది. ఈ పనులు వివిధ దశల్లో జరుగుతున్నాయి. మూడో మార్గంలో గ్రీన్‌వేస్ స్టేషన్ నుంచి అడయార్ జంక్షన్ వరకు సొరంగం తవ్వే పనులు 2023 ఫిబ్రవరిలో ప్రారంభమయ్యాయి. సొరంగమార్గం అడయార్ నది కింద 300 మీటర్ల పొడవు, 10-13 మీటర్ల లోతుతో వెళ్తోంది. కావేరి, అడయార్ అనే రెండు సొరంగం తవ్వే యంత్రాలు తమ పనులు విజయవంతంగా పూర్తిచేసి అడయార్ స్టేషన్‌కు చేరుకున్నాయి. అడయార్ నది అడుగున పెద్ద బండరాళ్లు ఉండడంతో వాటి తొలగింపు సవాలుగా మారినట్లు అధికారులు తెలిపారు. ఎట్టకేలకు ఆ పనులు ముగిశాయన్నారు. కావేరి యంత్రం కొన్ని పెట్రోల్ బంక్‌లు, ఎంజీఆర్ జానకి కళాశాల, ఆంధ్ర మహిళాసభ ఆస్పత్రి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ రోడ్డు, అడయార్ వంతెన కింద సొరంగం తవ్వకాలు చేపట్టిందన్నారు. రెండవ యంత్రం అడయార్ స్టేషన్‌కి 277 మీటర్ల దూరంలో ఉందని, నవంబరు నాటికి ఈ యంత్రం అడయార్ స్టేషన్ చేరుకుంటుందని అధికారులు పేర్కొన్నారు.

# యూపీఎస్సీ మెయిన్స్ ప్రారంభం



● రాష్ట్ర వ్యాప్తంగా చెన్నైలోనే పరీక్షా కేంద్రాలు

● 29 వరకు జరగనున్న పరీక్షలు

అడయార్, సెప్టెంబరు 20: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్స్ మెయిన్స్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తమిళనాడు రాష్ట్రంలో చెన్నై ఎంపిక చేసి, ఎగ్మోర్, పెరంబూరు, కోడంబాక్కం ట్రస్ట్‌పురంలో ఈ పరీక్ష నిర్వహించారు. రాష్ట్రానికి చెందిన సుమారు 600 మంది వరకు హాజరయ్యారు. మొత్తం ఐదు రోజుల పాటు ఈ పరీక్ష జరుగుతుంది. ఇందులో భాగంగా తొలి రోజైన శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 జరిగింది. అభ్యర్థులు ఉదయం 7 గంటలకే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. వీరిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. ఎగ్జామ్ సెంటరులోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. పరీక్షా కేంద్రం వద్ద గట్టి పోలీస్ భద్రత కల్పించారు. కాగా, ఈ పరీక్షలు ఈ నెల 29వ తేదీతో ముగుస్తాయి.



పరీక్షా హాలు వద్ద అభ్యర్థులు

# చెన్నైలో కేరళ సీఎంకు వైద్యపరీక్షలు



పినరయి విజయన్

పెరంబూర్, సెప్టెంబరు 20: కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు స్థానిక అపోలో ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. గురువారం నగరానికి వచ్చిన పినరయి విజయన్, గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఈసీజీ, ఎకో తదితర గుండె సంబంధిత పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఫలితాల్లో, ఆయన ఆరోగ్యంగా ఉన్నట్లు నిర్ధారణ అయింది. పరీక్షల అనంతరం మధ్యాహ్నం బయల్దేరి వెళ్లారు. కొద్ది సంవత్సరాల క్రితం చెన్నై అపోలో ఆస్పత్రిలో చేరిన పినరయి విజయన్‌కు చికిత్స అందించిన విషయం తెలిసింది.

# అక్టోబర్ 27న టీవీకే మహానాడు

ఎట్టకేలకు ప్రకటించిన విజయ్



చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) తొలి మహానాడు విక్రవాండి సమీపం వి.సాలై గ్రామంలో అక్టోబర్ 27న నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు, సినీనటుడు విజయ్ ప్రకటించారు. ఇటీవల పార్టీ పతాకాన్ని ఆవిష్కరణ అట్టహాసంగా జరిపిన విజయ్ త్వరలో పార్టీ తొలి మహానాడు జరుపనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకారం విక్రవాండి వద్ద ఈ నెల 23న మహానాడు జరుపతలపెట్టారు. పోలీసుల అనుమతి కూడా తీసుకున్నారు. కాగా అనివార్య కారణాలతో మహానాడు వాయిదా వేశారు. దీంతో పార్టీ శ్రేణులంతా తీవ్ర నిరాశ చెందారు. ఈ నేపథ్యంలో పార్టీ తొలి మహానాడు తేదీని శుక్రవారం ఉదయం విజయ్ ప్రకటించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించినప్పటి నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు తొలి మహానాడు ఎప్పుడు జరుగుతుందా అని ఆసక్తిగా ఎదురు చూశారని, మహానాడు తేదీ వాయిదా పడినట్లు తెలుసుకుని ఎంతో నిరాశచెందారని ఆయన తెలిపారు. భారీ ఏర్పాట్ల నడుమ మహానాడు జరుపతలపెట్టడం వల్లే తేదీ మార్చినట్లు ఆయన పేర్కొన్నారు. అక్టోబర్ 27 సాయంత్రం 4 గంటలకు విల్లుపురం జిల్లా విక్రవాండి సమీపంలో సాలై గ్రామంలో ప్రారంభమవుతుందని, ఆ సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, లక్ష్యాలు ప్రకటించనున్నామని విజయ్ ఆ ప్రకటనలో తెలిపారు. ఈ మహానాడుకు లక్షలాది మంది పార్టీ శ్రేణులు తరలిరావాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. మహానాడు విజయవంతమయ్యేందుకు రాష్ట్ర ప్రజలంతా తనను దీవించాలని విజ్ఞప్తి చేశారు.

# ఆమ్‌స్ట్రాంగ్ హత్య కేసులో సెల్వపెరుంతగైను విచారించాలి

● బీజేపీ నేత హెచ్.రాజా డిమాండ్



ఐస్‌హౌస్ వద్ద వాహన చోదకులకు హెల్మెట్లు ఎంపిణీ చేస్తున్న రాజా

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగైని పోలీసులు విచారణ జరపాలని బీజేపీ రాష్ట్ర సమన్వయక మిటీ అధ్యక్షుడు హెచ్.రాజా డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ 74 వ జన్మదిన వేడుకల్లో భాగంగా ఐస్‌హౌస్ ప్రాంతంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సతీష్ నాయకత్వంలో 'మోదీ దేశానికి రక్షణ కవచం.. మీ శిరస్సుకు హెల్మెట్ రక్షణ కవచం' అనే నినాదంతో వాహనచోధకులకు ఆయన హెల్మెట్లు పంపిణీ చేశాశారు. ఈ సందర్భంగా రాజా మీడియాతో మాట్లాడుతూ.. నగరంలో సంచలనం కలిగించిన బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగైకి సంబంధాలున్నట్లు బీఎస్పీ నేత జయశంకర్ ఫిర్యాదు చేశారని, దీనిపై పోలీసులు జాప్యం చేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా సెల్వపెరుంతగైని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ జరపాలని కోరారు. ఓ ఆడిటర్ హత్యకేసులో సెల్వపెరుంతగై నిందితుడని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీని తాను దేశద్రోహి అని విమర్శించలేదని, భారతీయులంతా రాహుల్ అనుసరిస్తున్న భారత వ్యతిరేక చర్యలు, చేస్తున్న వ్యాఖ్యలపై ముక్తకంఠంతో తీవ్రంగా ఖండిస్తున్నారని రాజా చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు విజయ్ ఆనంద్, సౌందర్, కిషోర్, సుమో సురేష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు ఉపకారవేతనం రెట్టింపు

పరిశోధనలకు రూ.లక్ష ● సీఎం స్టాలిన్ ఆదేశం



అడయార్, సెప్టెంబరు 20: రాష్ట్రంలో వివిధ పాఠశాలలు, కాలేజీలు, వృత్తివిద్యా శిక్షణా కేంద్రాల్లో చదివే దివ్యాంగ విద్యార్థులకు ముఖ్యమంత్రి స్టాలిన్ శుభవార్త చెప్పారు. ప్రభుత్వం ఇస్తున్న ఉపకారవేతనాన్ని రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, పరిశోధన చేసే దివ్యాంగ విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్‌ను లక్ష రూపాయలకు పెంచారు. ఈ మేరకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. దివ్యాంగుల పట్ల దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎం.కరుణానిధి చూపిన మార్గంలోనే ముఖ్యమంత్రి స్టాలిన్ పయనిస్తూ, వారి యోగక్షేమాలపై ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న ఉపకారవేతనాలను సీఎం రెట్టింపు చేసి, ఇందుకు అవసరమైన నిధులు కూడా కేటాయించారు. పాఠశాల్లో ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదివే దివ్యాంగ విద్యార్థులకు ఇచ్చే ఉపకారవేతనాన్ని రూ.1000 నుంచి రూ.2000లకు పెంచారు. ఆరో తరగతి నుంచి 8వ తరగతి వరకు చదివే వారికి రూ.3 నుంచి రూ.6 వేలకు పెంచారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి చదివే దివ్యాంగ విద్యార్థుల ఉపకారవేతనాన్ని రూ.4 నుంచి రూ.8 వేలకు పెంచుతూ ఆదేశించారు. అదేవిధంగా కళాశాలలో దివ్యాంగ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి యేటా ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేల ఉపకారవేతనాన్ని రూ.12 వేలకు, వృత్తి విద్య శిక్షణా కాలేజీలో విద్యార్థులకు ఇచ్చే ఉపకారవేతనాన్ని రూ.7 వేల నుంచి రూ.14 వేలకు పెంచారు. అదేవిధంగా సీఎం రీసెర్చ్ ప్రాజెక్టు కింద పరిశోధన చేసే దివ్యాంగ విద్యార్థులకు అందించే రూ.50 వేల మొత్తాన్ని లక్ష రూపాయలకు పెంచుతూ సీఎం ఆదేశాలు జారీ చేయడమేకాకుండా ఇందుకు అవసరమైన నిధులను కూడా కేటాయింరు.

## జాన్ మార్షల్‌కు విగ్రహం

సీఎం స్టాలిన్

ప్యారీస్, సెప్టెంబరు 20: భారత ఉపఖండ చరిత్రను విప్లవాత్మకంగా మార్పుచేసి సింధు నాగరికతను వెలికితెచ్చిన జాన్ మార్షల్‌కు ఘనత చేకూర్చే విధంగా రాష్ట్రప్రభుత్వం తరఫున ఆ మహనీయుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి వేడుకలు జరుపుకోనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. సీఎం శుక్రవారం తన ఎక్స్ పేజీలో ఈ మేరకు తెలియజేశారు. సరిగ్గా నూరేళ్ల క్రితం 1924 సెప్టెంబరు 20వ తేదీ సర్ జాన్ మార్షల్ సింధు నాగరికత విశిష్టతను వెలికితీసుకొచ్చి భారత ఉపఖండ చరిత్ర ఎన్నటికీ మరచిపోని విధంగా మార్పు చేశారని, ఆయన సేవలను గుర్తుచేసుకొని కృతజ్ఞతలు తెలియజేశారు. సింధు నాగరికతలో బయల్పడిన వస్తువులను పరిశోధించి ఆయన, ద్రావిడ చరిత్రతో సంబంధాలున్నట్లు తెలియజేశారని, ఈ గొప్ప విషయాన్ని అంతర్జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించడంతో పాటు ఆయన నిలువెత్తు విగ్రహాన్ని రాష్ట్రంలో ప్రతిష్ఠించి వేడుకలు జరుపుకోనున్నట్లు సీఎం తన ప్రకటనలో తెలిపారు.

# మాకు నామినేటెడ్ పదవులేవీ?

● డీఎంకేపై కాంగ్రెస్ గుర్రు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అధికారంలో భాగస్వామ్యం లేకపోయినా, కనీసం తమకు నామినేటెడ్ పదవులు కూడా కట్టబెట్టడం లేదంటూ కాంగ్రెస్ నేతలు అసంతృప్తితో రగిలిపోతున్నారు. గురువారం సత్యమూర్తిభవన్‌లో జరిగిన కార్యాచరణ మండలి సమావేశంలో ఈ విషయం బయల్పడింది. తమకు ఏమాత్రం విలువ ఇవ్వని పార్టీలో పొత్తు ఎందుకు పెట్టుకోవాలంటూ పలువురు నేతలు టీఎన్‌సీసీ అధ్యక్షుడిని నిలదీసినట్లు సమాచారం. అటు రాష్ట్ర అధికారంలో భాగస్వామ్యం లేక, ఇటు నామినేటెడ్ పదవుల్లేక తాము రాజకీయాల్లో ఎందుకు కొనసాగాలని నిలదీశారు. డీఎంకే నేతలు తమను కనీసం గౌరవించడం లేదని, అలాంటప్పుడు తాము కింది స్థాయిలో ఎందుకు సహకరించాలని ప్రశ్నించారు. దీంతో కార్యాచరణమండలి సమావేశం ఒక్కసారిగా వేడెక్కింది. తాజాగా రాబోవు స్థానిక సంస్థల, శాసనసభ ఎన్నికలపై వ్యూహరచన చేయడానికి గురువారం సత్యమూర్తి భవన్‌లో జరిగిన కార్యాచరణ మండలి సమావేశం, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శుల సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా కొంతమంది జిల్లా నేతలు రెండు పార్టీల మధ్య పొత్తు కొనసాగినా కాంగ్రెస్ నేతలపట్ల డీఎంకే నేతలు ఉదాసీన వైఖరినే అవలంబిస్తున్నారని, మున్ముందు కూడా ఇదే పరిస్థితి కొనసాగితే పార్టీ ప్రతిష్ట దిగజారి పోతుందని వాపోయారు.తిరునల్వేలి నాయకుడు శంకరపాండ్యన్ మాట్లాడుతూ లోక్‌సభఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక మెజారిటీతో గెలిచిన తిరుచ్చి సీటును డీఎంకేకు ఇవ్వడం పార్టీ చేసిన తప్పన్నారు. ఇదే రీతిలో డీఎంకే అత్యధిక ఓట్లు పొందే సీటు కాంగ్రెస్‌కు ఇస్తుందా అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ తిరునల్వేలిలో ప్రచారం చేయడానికి వస్తే ఆయన దరిదాపులకు కాంగ్రెస్ నేతలు వెళ్లకుండా డీఎంకే అడ్డుకుందని ఆరోపించారు. రాహుల్ పాదయాత్ర వల్లే డీఎంకేకి ఓట్ల శాతం పెరిగిందన్న విషయాన్ని ఆ పార్టీ మరచిపోయిందన్నారు. కొన్ని జిల్లాల్లో డీఎంకే నేతల సిఫారసు లేకుండా కాంగ్రెస్ నేతలు అధికారులతో పనులు చేయించుకోలేని పరిస్థితులున్నాయని చెప్పారు. ఈ పరిస్థితులే కొనసాగితే పార్టీ రాష్ట్రంలో ఎలా అభివృద్ధి చెందగలదని ప్రశ్నించారు. ఇక ప్రభుత్వ శాఖల్లో వివిధ బోర్డులకు సంబంధించిన పదవులను కూడా కాంగ్రెస్‌కు కేటాయించడం లేదని వాపోయారు. సంపాదన కోసం తాము ఈ పదవులను అడగటం లేదని, స్థానికంగా ప్రజల మధ్య పరపతి పెంచుకోవచ్చనే ఆశతోనే అడుగుతున్నామని మరి కొందరు నేతలు టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగైకి చెప్పారు. కనీసం ఆలయాల ట్రస్టు బోర్డు పదవులు కూడా కాంగ్రెస్‌కు దక్కటం లేదని, ఇలాంటి పరిస్థితుల్లో డీఎంకేతో పొత్తుపై అధిష్ఠానం పునఃపరిశీలించాల్సిన అవసరముందన్నారు. వీలైనంత త్వరగా డీఎంకేతో తెగతెంపులు చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై సెల్వపెరుంతగై మాట్లాడుతూ... కాంగ్రెస్ సభ్యులకు ప్రభుత్వ నామినేటెడ్ పదవులు పొందే విషయమై పార్టీ అధిష్ఠానంతో మాట్లాడాక ముఖ్యమంత్రి స్టాలిన్‌తో చర్చిస్తానని, అంతవరకూ సహనం పాటించాలని నాయకులకు సర్దిచెప్పినట్లు తెలిసింది.



పట్టుబడిన ముఠా

# రూ.35 కోట్ల ఎలక్ట్రానిక్ వస్తువుల కంటైనర్ చోరీ

● ఆరుగురి అరెస్ట్

ప్యారీస్, సెప్టెంబరు 20: చెన్నై ఓడరేవు నుంచి రూ.35 కోట్లు విలువచేసే ఎలక్ట్రానిక్ పరికరాలతో కూడిన కంటైనర్ లారీ చోరీ చేసిన వ్యవహారంలో ఆరుగురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నగరానికి చెందిన ఓ సంస్థ కోసం చైనా నుంచి ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు దిగుమతయ్యాయి. సుమారు రూ.35 కోట్ల విలువైన వస్తువులతో దిగుమతయిన ఈ కంటైనర్‌ను సంబంధిత సంస్థ డెలివరీ చేయకముందే ఇతరులు నకిలీ రసీదులు పోర్ట్ అధికారులకు అందించి ఓ లారీలో ఎక్కించుకొని వెళ్లిపోయారు. ఆ తర్వాత కంటైనర్ డెలివరీ కోసం వెళ్లిన సంబంధిత ఉద్యోగులు అప్పటికే కంటైనర్ డెలివరీ అయినట్లు తెలుసుకున్నారు. దీంతో అధికారుల సహకారంతో కంటైనర్‌తో వెళ్లిన లారీ రిజిస్ట్రేషన్ నెంబరు ఆధారంగా జీపీఎస్ ద్వారా ఏ మార్గంలో వెళ్తుందో ఆచూకీ తెలుసుకున్నారు. ఆ రీతిలో ఆ లారీ తిరువళ్లూర్ సమీపంలో నిలిపివున్నట్లు తెలుసుకొని పోలీసులతో కలసి అక్కడికెళ్లారు. ఆ సమయంలో కంటైనర్‌లో ఉన్న ల్యాప్‌టాప్‌లు, ఇతర వస్తువులను దించి మరో చిన్న లారీల్లో ఎక్కిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ నేరానికి పాల్పడిన లారీ యజమాని మణికంఠన్, దళార్లు రాజేష్, నెపోలియన్, శివబాలన్, ముత్తురాజ్, దిండుగల్‌కు చెందిన లారీ డ్రైవర్ బాల్‌రాజ్ అనేవారిని అరెస్ట్ చేశారు. ఈ ముఠాకు నాయకత్వం వహించి పరారైన ఇళవరసన్ కంటైనర్ డెలివరీకి నకిలీ రసీదు సృష్టించినట్లు విచారణలో తెలిసింది. అతడి కోసం కూడా గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# తిరువణ్ణామలై సహా కొత్త రైలు మార్గాలు నిర్మించండి

● రైల్వే మంత్రికి బీజేపీ నేతల వినతి



రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అశ్వత్థామన్ తదితరులు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలై, విరుదాచలం, కుంభకోణం నగరాలకు కొత్త రైలు మార్గాలను నిర్మించాలని రాష్ట్ర బీజేపీ నేతలు కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి అశ్వత్థామన్ తదితర నాయకులు రైల్వే మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రామేశ్వరం దీవిని కలుపుతూ పాంబన్ సముద్ర మార్గంలో పాత రైలు మార్గాన్ని ఆనుకుని కొత్తగా నిర్మించిన రైలు మార్గాన్ని అక్టోబర్ 2న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారని తెలిపారు. అదే సమయంలో పాంబన్ పాత రైలు మార్గాన్ని లోకల్ టూరిస్టు రైళ్లు నడిపేందుకు చర్యలు చేపట్టాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు అశ్వత్థామన్ తెలిపారు. ఇక రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతం తిరువణ్ణామలైకి కాట్పాడి, వేలూరు మీదుగా వెళ్లటడానికి 6 గంటలు పడుతోందని, ఈ నేపథ్యంలో చెన్నై నుంచి తిరువణ్ణామలైకి నేరుగా కొత్త రైలు మార్గం నిర్మించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు చెప్పారు. చెన్నై నుంచి దిండివనం మీదుగా తిరువణ్ణామలైకి రైలు మార్గం నిర్మిస్తే ప్రయాణ సమయం మూడు గంటలు తగ్గుతుందన్నారు. ఇదే విధంగా విరుదాచలం నుంచి కుంభకోణంకు కొత్త రైలు మార్గం నిర్మిస్తే రెండు నగరాల నడుమ వాణిజ్య సంబంధాలు మెరుగవుతాయని తెలిపారు.

# టేకాఫ్ సమయంలో ఎమర్జెన్సీ డోర్ ఓపెన్

● ఫ్లైట్ 2 గంటల ఆలస్యం

అడయార్, సెప్టెంబరు 20: చెన్నై స్వదేశీ విమానాశ్రయం నుంచి ముంబై బయలుదేరిన విమానం టేకాఫ్ అవుతున్న సమయంలో ఒక ప్రయాణికుడు అత్యవసర ద్వారం తెరవడంతో ఇతర ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. దీంతో ఆ విమానం రెండు గంటల ఆలస్యంగా బయలుదేరి వెళ్ళింది. ఈ ఘటనకు సంబంధించి అహ్మదాబాద్‌కు చెందిన వరుణ్ భరత్ (45) అనే ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్న విమానాశ్రయ పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇండిగో సంస్థకు చెందిన ఈ విమానంలో 151 మంది ప్రయాణికులతో విమాన సిబ్బంది కూడా ఉన్నారు. ప్రయాణికుడు చేసిన పని కారణంగా విమానం 2 గంటలు ఆలస్యంగా గురువారం అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరి వెళ్ళింది.

# 2044 వరకు గిండి రేస్ క్లబ్ లీజు గడువు

● క్లబ్ కార్యదర్శి నిర్మల్ ప్రసాద్



చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రేస్ క్లబ్ లీజు గడువింకా ముగియలేదని, 2044 వరకూ ఉందని ఆ క్లబ్ కార్యదర్శి నిర్మల్ ప్రసాద్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో 1777లో ప్రభుత్వం నుంచి 614 ఎకరాలు లీజుకుతీసుకుని మద్రాస్ రేస్‌క్లబ్ ప్రారంభమైందని, 1877లో క్లబ్‌లో 50 మంది సభ్యులుండేవారని, ఆ తర్వాత 1923లో 30 యేళ్లకు, 1946లో 99 యేళ్లకు లీజు ఒప్పందాలు కుదుర్చుకుందని వివరించారు. లీజుకు తీసుకున్న భూములను విక్రయిస్తున్నామని, క్లబ్ ప్రాంగణాన్ని పెళ్లిమండపాలుగా అద్దెకిస్తున్నామని ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలు అవాస్తవని తెలిపారు. రేస్ క్లబ్‌కు చెందిన 160 ఎకరాలను ఎవరికీ విక్రయించలేదని, వాస్తవానికి అడయార్, వెంకటాపురం ప్రాంతంలో స్విమ్మింగ్‌పూల్ కోసం, రాష్ట్ర హౌసింగ్ బోర్డుకు, ప్రైవేటు సంస్థలకు అనువుగా రహదారులను నిర్మించడానికే స్థలాలను కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం రేస్ క్లబ్‌లో 5 వేల మంది పనిచేస్తున్నారని, ప్రతియేటా తమ క్లబ్ పన్ను రూపేణా ప్రభుత్వానికి రూ.10 కోట్లు చెల్లిస్తోందని వివరించారు. లీజు ఒప్పందం ప్రకారమే క్లబ్ నడచుకుంటున్నదని, లీజు గడువు 2044 దాకా ఉందని నిర్మల్ ప్రసాద్ పేర్కొన్నారు.

**ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు...**

ఇదిలాఉండగా లీజుకిచ్చిన స్థలం నుంచి గిండి రేస్‌క్లబ్‌ను ఖాళీ చేయించే వ్యవహారంపై దాఖలైన కేసులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలంటూ మద్రాసు హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులిచ్చింది. గిండి రేస్‌క్లబ్ నిర్వాహకులు రూ.730.86 కోట్ల మేరకు లీజు బకాయి చెల్లించలేదంటూ ఆ లీజును రద్దు చేస్తూ ఈ నెల 6న ఉత్తర్వు జారీ చేసింది. దానిని వ్యతిరేకిస్తూ మద్రాస్ రేస్‌క్లబ్ నిర్వాహకులు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ న్యాయమూర్తి ఆర్ఎంటీ టీకారామన్ ఎదుట విచారణకు వచ్చింది. రేస్‌క్లబ్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది పీహెచ్ అరవింద్ పాండ్యన్ రేస్‌క్లబ్ భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా స్వాధీనం చేసుకోలేదని, ఈ భూములను ప్రభుత్వ పరం చేయడానికి ఈ నెల 24 వరకు గడువివ్వటంతో అత్యవసర కేసుగా భావించి విచారణ జరపాలని కోరారు. రేస్‌క్లబ్ భూములను ప్రభుత్వం స్వాధీనపరచుకుందని, ఈ కేసులో కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి గడువివ్వాలని ప్రభుత్వ తరఫున హాజరైన న్యాయవాది పి.విల్సన్ కోరారు. రేస్‌క్లబ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదని ఆ క్లబ్ నిర్వాహకులు చెబుతుండగా, ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని ప్రభుత్వ తరఫు న్యాయవాది చెబుతున్నారని, ఈ నేపథ్యంలో అత్యవసర కేసుగా పరిగణించాలన్న పిటిషనర్ వాదనపై ఈ నెల 23లోగా ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ సమర్పించాలని నోటీసు జారీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## సమాచార దర్శిని

### 'తిరుక్కురల్' పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్,సెప్టెంబరు20:తిరుక్కురల్, తిరువాసగాలకు సంబంధించిన పరిశోధకుల పురస్కారాలకు అర్హులైన వారుదరఖాస్తు చేసుకోవాలని తమిళనాడు ట్రస్ట్ ప్రధాన కార్యాచరణాధికారి తెలిపారు. పరిశోధకులను ప్రోత్సహించేలా ట్రస్ట్ ఆధ్వర్యంలో కందస్వామి మాణిక్యం, పద్మావతి మాణిక్యం, విద్యా పథకం కింద (తలా ఒకరికి) తలా ఒకరికి రూ. లక్ష అవార్డు అందజేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు www.tnfindia.org అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని అక్టోబరు 10వ తేదిలోపు పూర్తిచేసి 'తమిళనాడు ట్రస్ట్, నెం.25, టైలర్స్ రోడ్డు, కీల్పాక్కం, చెన్నై-10' అనే చిరునామాకు పంపించాలని తెలిపారు.

### కిలో నిమ్మ రూ.200

ఐసిఎఫ్,సెప్టెంబరు20:దిగుబడి తగ్గడంతో మార్కెట్లో కిలో నిమ్మకాయలు రూ.200లకు విక్రయమవుతున్నాయి. నిమ్మకాయలు ఏడాది పొడవునా లభించినా, మే, జూన్‌లో వీటి ధరలు ఎక్కువగా ఉంటాయి. ప్రస్తుతం వైరస్ సోకడం వల్ల నిమ్మకాయల దిగుబడి తగ్గింది. దీంతో మార్కెట్లో చిల్లర విక్రయంగా కిలో రూ.200రైతుబజార్‌రూ.150కువిక్రయమవుతున్నాయి.

### నేటినుంచి నవరాత్రి విక్రయ ప్రదర్శన

ఐసిఎఫ్, సెప్టెంబరు 20: రాష్ట్ర మహిళాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నుంగంబాక్కంలో ఉన్న అన్నై థెరిస్సా కాంప్లెక్స్‌లో శనివారం నుంచి అక్టోబరు 6వ తేది వరకు నవరాత్రి విక్రయ ప్రదర్శన జరుగనుంది. ప్రతిరోజు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే ఈ ప్రదర్శనలో మహిళా స్వయం సహాయక బృందాలు తయారుచేసిన వస్తువులు, చిరుధాన్యాల నుంచి నవరాత్రి కొలువు బొమ్మల వరకు అన్ని వస్తువులు విక్రయించనున్నారు.

### 23న యోగా, ప్రకృతి వైద్యకోర్సులకు కౌన్సెలింగ్

ఐసిఎఫ్, సెప్టెంబరు 20: యోగా, ప్రకృతి వైద్యకోర్సుల ర్యాంకుల జాబితా గురువారం విడుదల కాగా, కౌన్సెలింగ్ సోమవారం ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు యోగా, ప్రకృతి వైద్యకళాశాలల్లో 1,660 సీట్లున్నాయి. వీటిలో ప్రభుత్వ వైద్యకళాశాలల్లో 160 సీట్లు, ప్రైవేటు వైద్యకళాశాలల్లో ప్రభుత్వ కోటాకు 960 సీట్లు, మేనేజ్‌మెంట్ కోటాకు 540 సీట్లున్నాయి. వాటికి 2,320 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారి ర్యాంకుల జాబితా గురువారం భారత వైద్యం, హోమియోపతి డైరెక్టరేట్ విడుదల చేసింది. కౌన్సెలింగ్ సోమవారం నుంచి జరుగనుంది. 23వ తేది ప్రత్యేక విభాగం, 24న జనరల్ విభాగం, 26,27 తేదీల్లో మేనేజ్‌మెంట్ కోటా విభాగాలకు కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు.

### 8 మందికి సీఎం ఆర్థికసాయం

ఐసిఎఫ్, సెప్టెంబరు 20: ముఖ్యమంత్రి స్టాలిన్ 8 మంది పేదలకు ఆర్థికసాయం అందజేశారు. కలైంజర్ కరుణానిధి ట్రస్ట్ కోసం దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి అందజేసిన రూ.5 కోట్లకు వచ్చే వడ్డీని ప్రతినెలా పేదల వైద్య, విద్య, ఇతర అవసరాల కోసం ఆర్థికసాయం చేస్తున్నారు. ఈ నెల 8 మందికి తలా రూ.25,000 చొప్పున రూ.2 లక్షలను ముఖ్యమంత్రి గురువారం అందజేశారు.

### 15 జిల్లాల రిజిస్ట్రార్ల బదిలీ

ఐసిఎఫ్, సెప్టెంబరు 20: రిజిస్ట్రేషన్ శాఖలో 15 జిల్లా రిజిస్ట్రార్లు బదిలీ అయ్యారు. నామక్కల్ జిల్లా రిజిస్ట్రార్ సంతానం ఈరోడ్ జిల్లాకు, ఈరోడ్ జిల్లా రిజిస్ట్రార్ సెంథిల్‌కుమార్ సేలం తూర్పు జిల్లాకు, అక్కడున్న రిజిస్ట్రార్ కల్పన దిండివనం జిల్లాకు, దిండివనం జిల్లా రిజిస్ట్రార్ పునిత చెంగల్పట్టు జిల్లాకు బదిలీ అయ్యారు. మైలాడుదురై జిల్లా రిజిస్ట్రార్ శశికళ చిదంబరం జోన్‌కు బదిలీ అయ్యారు. ఆ ప్రకారం 15 జిల్లా రిజిస్ట్రార్లను వేర్వేరు ప్రాంతాలకు బదిలీ చేస్తూ వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ కార్యదర్శి ప్రజేంద్రనవనీత్ ఉత్తర్వులు జారీచేశారు.

### పూండికి కండలేరు జలాలు విడుదల

ఐసిఎఫ్, సెప్టెంబరు 20: కండలేరు డ్యాం నుంచి పూండి జలాశయానికి 500 ఘనపుటడుగుల నీటిని విడుదల చేశారు. ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి పూండి జలాశయానికి ప్రతి ఏటా కృష్ణ నదీజలాల వాటా పథకం కింద జనవరి నుంచి ఏప్రిల్ వరకు 4 టీఎంసీలు, జూలై నుంచి అక్టోబరు వరకు 8 టీఎంసీలు అని 12 టీఎంసీలు విడుదల చేయాల్సి ఉంది. జనవరిలో పూండి జలాశయంలో నీరు నిల్వ ఉండడంతో కండలేరు జలాలు పొందలేదు. ఈ నేపథ్యంలో, గురువారం మధ్యాహ్నం కండలేరు డ్యాం నుంచి పూండి జలాశయానికి సెకనుకు 500 ఘనపుటడుగుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. మూడు రోజుల్లో రాష్ట్ర సరిహద్దు ఊత్తుకోట సమీపంలోని తామరైకుప్పం జీరో పాయింట్‌కు ఈ జలాలు వచ్చిన అనంతరం పూండి జలాశయానికి తరలించనున్నట్లు అధికారులు తెలిపారు.

### 30 శాతం పెరిగిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, సెప్టెంబరు 20: రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 30 శాతం పెరిగింది. ఈ మేరకు విద్యుత్ బోర్డు శుక్రవారం విడుదల చేసిన ప్రకటన లో... రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ వినియోగం 14,000 మెగావాట్లుండగా, శీతాకాలంలో 12,000 మెగావాట్లు, వేసవిలో 16,000 మెగావాట్లు ఉంటుందన్నారు. కానీ, గత ఏడాది మే 2వ తేది రోజువారీ విద్యుత్ వినియోగం 20,830 మెగావాట్లకు చేరిందని, ఇదే రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగంగా ఉందని తెలిపింది. ప్రస్తుతం సాధారణం కన్నా 15 రోజులుగా ఎండ తీవ్రత అధికం కావడంతో విద్యుత్ వినియోగం 30 శాతానికి పెరిగింది. ఈ నెల 1వ తేది 13,709 మెగావాట్లున్న విద్యుత్ వినియోగం, ప్రస్తుతం 17,974 మెగావాట్లకు చేరుకుందని తెలిపింది. వినియోగం పెరగడంతో అవసరమైన ఉత్పత్తి చేపట్టేలా చర్యలు చేపట్టామన్నారు. ముఖ్యంగా విండ్ మిల్లుల నుంచి 80 మిలియన్ యూనిట్లు, కేంద్ర ప్రభుత్వం నుంచి 100 మిలియన్ల యూనిట్ల విద్యుత్ ప్రతిరోజు కొనుగోలు చేస్తున్నామన్నారు. అలాగే, సౌర విద్యుత్ 6,000 మెగావాట్లు లభిస్తుండడంతో, రాష్ట్రంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని విద్యుత్ బోర్డు తెలిపింది.

### రేపు పీబీ శ్రీనివాస్ జయంతి

ప్యారీస్, సెప్టెంబరు 20:నగరంలోని శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్, డా.పీబీ శ్రీనివాస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలోఆదివారం టినగర్‌లోని ఆంధ్రా కల్చరల్ అండ్ సోషల్ క్లబ్ (ఆస్కా)లో దివంగత గాయకుడు పీబీ శ్రీనివాస్ 94వ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు.ముఖ్యఅతిథిగా ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు పాల్గొననుండగా, పీబీ శ్రీనివాస్ పెద్దకుమారుడు డాక్టర్ పీబీ ఫణీందర్ తన తండ్రి జీవిత విశేషాలపై ప్రసంగించనున్నారు. డా.పీబీ శ్రీనివాస్ జయంతి వేడుకలకు అందరూ ఆహ్వానితులేనని శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

## మీకు రోజులు దగ్గరపడ్డాయ్

● డీఎంకేపై ఈపీఎస్ ఆగ్రహం

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తున్న డీఎంకే పాలకులకు రోజులు దగ్గరపడ్డాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాజీ మంత్రి, అన్నాడీఎంకే విప్ ఎస్పీ వేలుమణి, చెన్నై కార్పొరేషన్ మాజీ ఇంజనీర్లపై ఓ ప్రైవేటు సంస్థ కొన్నేళ్ల క్రితం చేసిన ఫిర్యాదులు, ఆధారాలను బట్టి ప్రస్తుత డీఎంకే ప్రభుత్వం ఏసీబీతో విచారణ జరిపేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. డీఎంకేకు చెందిన పలువురు మంత్రులపై పదేళ్ల నుంచి అవినీతి ఆరోపణ కేసుల విచారణలు జరుగుతున్నాయని, 2021లో అధికారంలో వచ్చిన డీఎంకే ప్రభుత్వం ఆ ఆరోపణలను ఏసీబీ చేత తలక్రిందులు చేయించే పని చేపట్టిందన్నారు. ఎస్పీ వేలుమణి పురపాలక శాఖమంత్రిగా ఉన్నప్పుడు చెన్నై కార్పొరేషన్‌లో పలు పథకాలు అమలు చేయించారని, అప్పట్లో వాననీటి సేకరణ పథకాన్ని ఉద్యమరీతిలో నిర్వహించడంతో ప్రజలకు వరద ముప్పు తప్పించారని తెలిపారు. డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతియేటా కోట్లాది రూపాయలతో వాననీటి కాల్వలను నిర్మిస్తూనే ఉన్నా, ఎక్కడా ఆ పనులు అసంపూర్తిగానే ఉన్నాయని, నిర్మాణ అంచనా వ్యయాలు పెరగటంతో ప్రజలకు బదులుగా కాంట్రాక్టర్లే ఎక్కువగా లబ్ది పొందారని తెలిపారు. డీఎంకే పాలనలో రూ.4 వేల కోట్ల అవినీతికి సంబంధించి రోజురోజుకూ వెల్లువెత్తుతున్న ఫిర్యాదులను చూసి మంత్రులు, పాలకులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రజలు డీఎంకే పాలకులపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పరాజయం చెంది పత్తాలేకుండా పోతుందని ఈపీఎస్ తెలిపారు.

## రూ.85,512 కోట్లతో 25 హైవేలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 20: రాష్ట్రంలో రూ.85,512 కోట్లతో 25 హైవేల నిర్మాణంచేపట్టాలని జాతీయ రహదారుల కమిషన్ నిర్ణయించింది. రాష్ట్రంలో 6,600 కి.మీ జాతీయ రహదారులు ఏర్పాటుచేసి పొరుగు రాష్ట్రాలతో అనుసంధానం చేశారు. ఈ మార్గాల్లో 67 చోట్ల టోల్‌గేట్లు ఏర్పాటుచేశారు. రాష్ట్ర హైవే శాఖ పర్యవేక్షణలో ఉన్న రహదారులను జాతీయ హైవేస్‌గా మార్చాలని ఆ శాఖ నిర్ణయించింది.

## నంగనల్లూర్‌లో రెండు థియేటర్లకు సీలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 20: స్థానిక నంగనల్లూర్‌లో ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో రెండు సినిమా థియేటర్లకు అధికారులు సీలు వేశారు. నంగనల్లూర్‌లో దివంగత మాజీ ఎమ్మెల్యే కంటోన్మెంట్ షణ్ముగంకు వెట్రివేల్, వేలన్ అనే రెండు థియేటర్లున్నాయి. 2018 నుంచి కార్పొరేషన్‌కు పన్ను చెల్లించకపోవడంతో ఇటీవల నోటీసులు జారీచేశారు. అయినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కార్పొరేషన్ అధికారులు గురువారం రెండు థియేటర్లకు సీలు వేశారు.

## కాట్పాడి నియోజకవర్గ అభివృద్ధికి కృషి

● మంత్రి దురైమురుగన్



లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందజేస్తున్న దురై మురుగన్

వేలూరు, సెప్టెంబరు 20: కాట్పాడి నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే దురైమురుగన్ తెలిపారు. కాట్పాడి గాంగేయనల్లూర్‌లో రూ.1.4 కోట్లతో గృహవసతి, నగర ప్రాంత అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో నిర్మించిన 24 దుకాణాలను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వేలూరు ఎంపీ కదిర్ ఆనంద్, ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, మండ కమిటీ అధ్యక్షులు పుష్పలత తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పలు శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు మంత్రి సంక్షేమ సహాయాలు పంపిణీ చేశారు.

## వైద్యుడి కుమారుడితో పనిమనిషి పరార్

● ఇప్పటికే నాలుగు పెళ్ళిళ్ళు

● నాగర్‌కోయిల్‌లో ఆసక్తికర ఘటన

అడయార్, సెప్టెంబరు 20: కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోయిల్‌లో ఇప్పటికే నాలుగు వివాహాలు చేసుకుని మోసాలకు పాల్పడిన పెళ్ళిళ్ళ రాణి ఐదో వివాహం కోసం వైద్యుడి కుమారుడితో పారిపోయింది. వైద్యుడి ఇంటిలో పనిమనిషిగా చేస్తూ, అతని కుమారుడిని లోబరచుకుంది. ఆ తర్వాత ఆ యువకుడితో 50 సవర్ల బంగారం చోరీ చేయించి అతడితో పారిపోయింది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, కన్నియాకుమారి జిల్లాకు చెందిన ఓ వైద్యుడి ఇంటి లో పనిచేసేందుకు పనిమనిషి కావాలని ప్రకటన వేశారు. దీంతో తిరునెల్వేలి జిల్లా పాలయంకోటకు చెందిన 29 యేళ్ళ మహిళ పనిలో చేరారు.. పనిలో చేరిన తర్వాత వైద్యుడి కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా, ప్రేమగా నడుచుకుంటూ కుటుంబంలో ఒకరిగా కలిసిపోయింది. అదేసమయంలో అవివాహితుడైన వైద్యుడి కుమాడిని లోబరుచుకుంది. ఈ విషయం తెలుసుకున్న వైద్యుడు ఆమెను పనిలో నుంచి నిలిపి వేయాలని భావించగా, కుమారుడు తీవ్రంగా వ్యతిరేకించాడు. ఈ క్రమంలో పనిమనిషితో వైద్యుడి కుమారుడు ఇంటి నుంచి అదృశ్యం కావడంతో వైద్యుడు ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులకు దర్యాప్తులో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూశాయి. వీరిద్దరూ తిరునెల్వేలిలో ఒక ఇంటిలో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత ఆ మహిళ కోసం విచారించగా ఇప్పటికే నాలుగు పెళ్ళిళ్ళు చేసుకున్నట్టు చెప్పింది.

## 3 నుంచి రాజ్‌భవన్‌లో నవరాత్రి బొమ్మల కొలువు

● ప్రజల సందర్శనకు అనుమతి



పెరంబూర్, సెప్టెంబరు 20: స్థానిక గిండిలో ఉన్న రాజ్‌భవన్‌లో జరుగనున్న 'నవరాత్రి కొలువు-2024' కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రజలు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు రాజ్‌భవన్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... రాజ్‌భవన్‌లో అక్టోబరు 3 నుంచి 12వ తేది వరకు జరుగనున్న బొమ్మల కొలువును 3వ తేది గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రారంభిస్తారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు పూజలు, 5 నుంచి 6 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో ప్రైవేటు, పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన వారు టచ్ఛుర్చిట్టుటజీజ్బుట్టు.జౌరి.జీ అనే ఈ-మెయిల్‌లో ఈ నెల 30వ తేది వరకు దరఖాస్తులు పంపించాలి. దరఖాస్తులో పేరు, వయస్సు , చిరునామా, మొబైల్ నెంబరు, సందర్శన తేది, ఫొటో గుర్తింపు కార్డు తదితరాలు జతచేయాలి. 'మొదట వచ్చిన వారికి ప్రాధాన్యత' ఆధారంగా ప్రతిరోజూ 150 మందిని అనుమతించనున్నారు. దరఖాస్తుదారులకు సందర్శన తేదీ మెసేజ్ ద్వారా పంపించడం జరుగుతోంది. సందర్శకులు తమకు కేటాయించిన సమయానికి అరగంట ముందుగా రాజ్‌భవన్ రెండో ప్రవేశ ద్వారం వద్దకు, మెసేజ్ నకలు, ఒరిజినల్ గుర్తింపుకార్డుతో హాజరుకావాలని రాజ్‌భవన్ విజ్ఞప్తి చేసింది.

## ఆర్డీవో వాహనం ఢీకొని ఇద్దరి మృతి



ప్రమాదం జరిగిన దృశ్యం

పెరంబూర్, సెప్టెంబరు 20: పుదుకోట జిల్లా రెవెన్యూ అధికారి (ఆర్డీఓ) వాహనం ఢీకొని, ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. పుదుకోట ఆర్డీవో పి.ఐశ్వర్య ప్రభుత్వ వాహనంలో శుక్రవారం ఉదయం కార్యాలయానికి బయల్దేరారు. లెంబలకుడి టోల్ ప్లాజా దాటి వస్తుండగా, నగరత్తుపట్టి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వస్తున్న రామనాథపురం జిల్లాకు చెందిన ఇద్దరు సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనలో ఆర్డీవో ఐశ్వర్య, డ్రైవర్ కామరాజ్‌కు గాయాలయ్యాయి. వారిని పుదుకోట ప్రభుత్వ వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించిన నమనసముద్రం పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆలస్యంగా బయల్దేరిన లండన్, సింగపూర్ విమానాలు

ప్యారీస్, సెప్టెంబరు 20: నగరంలోని అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్, సింగపూర్ విమానాలు సుమారు నాలుగు గంటల ఆలస్యంగా బయల్దేరడంతో దాదాపు 400 మంది ప్రయాణికులు ఇబ్బందులపాలయ్యారు. ఇక్కడి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శుక్రవారం ఉదయం 5.30 గంటలకు లండన్ వెళ్లాల్సిన బ్రిటీష్ ఎయిర్‌వేస్ విమానం నాలుగు గంటలు ఆలస్యంగా ఉదయం 9.30 గంటలకు బయల్దేరింది. ఈ విమానం లండన్ నుంచి తెల్లవారుజామున 3.30 గంటలకు రావాల్సి ఉండగా, వాతావరణం అనుకూలించని కారణంగా ఉదయం 8 గంటలకు వచ్చింది. అదే విధంగా, సింగపూర్ నుంచి గురువారం రాత్రి 11.50 గంటలకు రావాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు వచ్చింది. దీంతో, ఈ విమానం కూడా సుమారు 4 గంటలు ఆలస్యంగా బయల్దేరి వెళ్లింది. అయితే, ఈ విమానాల ఆలస్యం గురించి ప్రయాణికులకు ఎటువంటి సమాచారం పంపించని కారణంగా ప్రయాణికులు నాలుగు గంటలు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

## అన్నామలై కొండపై కార్చిచ్చు



కొండపై కార్చిచ్చు ఏర్పడిన దృశ్యం

పెరంబూర్, సెప్టెంబరు 20: తిరువణ్ణామలైలో మహాదీపం వెలిగించే అన్నామలై కొండపై శుక్రవారం కార్చిచ్చు ఏర్పడింది. సుమారు ఎకరా పైగా ఔషధ మొక్కలు, చెట్లు మంటల్లో దగ్ధమయ్యాయి. ఆ ప్రాంతంలో ఉన్న జింకలు, ఇతర జంతువులు మంటల దాటిగా రంకెలు వేశాయి. గమనించిన చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. మూడు ఫైరింజన్లతో అక్కడకు చేరుకున్న సిబ్బంది శ్రమించి మంటలు అదుపుచేశారు. ఈ ఘటనపై ఫారెస్ట్ రేంజర్ శరవణన్ మాట్లాడుతూ... ఈ ప్రాంతంలో ఇతరులు మంటలు పెట్టేందుకు ప్రయత్నించే అవకాశం లేదన్నారు. ఎండల కారణంగా కొండపై ఉన్న గడ్డి, చిన్న మొక్కలకు ఏర్పడిన మంటలు ఎకరా విస్తీర్ణం మేర వ్యాపించాయని, ఈ ఘటనలో ఔషధ మొక్కలు, పలు రకాల చెట్లు దగ్గమయ్యాయని తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 20: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

**అనకాపుత్తూర్:** పమ్మల్ మెయిన్ రోడ్డు, గ్రెగరీ వీధి, మాసూరన్ వీధి, దైవనాయగం వీధి, బాలాజి నగర్ 1,2,12 క్రాస్ వీధులు, పసుమ్‌పొన్ నగర్, బాలాజి నగర్ 30 అడుగుల రోడ్డు, తిరు నగర్, లక్ష్మి నగర్, ఎల్లార్ రాజమాణిక్యం రోడ్డు, దేవదాస్ నగర్, రాఘవేంద్ర రోడ్డు. **గిండి:** గిండి ఎస్టేట్, ఈకాట్టుతాంగల్, గాంధీ నగర్, పూందమల్లి రోడ్డు, జేఎం రోడ్డు, అంబాల్ నగర్, లేబర్ కాలని, పిల్లయార్ ఆలయం 1 నుంచి 5 వీధులు, ఏ,బీ,సీ,డీ బ్లాక్‌లు, పూమగళ్ వీధి, సౌత్ బిల్డింగ్ వీధి, మౌంట్ రోడ్డు ఏరియా, బాలాజి నగర్, భారతియార్ వీధి, ధనకోటి రాజ వీధి, అచ్చుతన్ నగర్, మునుస్వామి వీధి.

**అడయార్:** పాలవాక్కం, బీఆర్ఎస్ నగర్, భారతిదాసన్ నగర్, భారతి నగర్, అంబేద్కర్ వీధి, స్కూల్ వీధి, పైదియర్ వీధి, మాపోసి వీధి, సుబ్బరాయన్ వీధి, మసూది వీధి, వావూసీ వీధి, పాలవాక్కంకుప్పం, సీ షెల్ అవెన్యూ, చెర్రీ అవెన్యూ, చైతన్ అవెన్యూ, వీజీపీ సింగారపురం అవెన్యూ, ఎంజీఆర్ రోడ్డు, చిన్న నీలాంగరై కుప్పం, రేడియో కాలని, కొట్టివాక్కం జర్నలిస్ట్ కాలని, శ్రీనివాసపురం, న్యూ బీచ్ రోడ్డు, న్యూ బీచ్ ఎక్స్‌టెన్షన్ ఏరియా, కావేరి నగర్ 1 నుంచి 6 వీధులు, కర్పగాంబాల్ నగర్, లక్ష్మణపెరుమాళ్ నగర్, తిరువళ్లువర్ నగర్ 1 నుంచి 59 వీధులు, భక్తసింగ్ రోడ్డు, వెంకటేశ్వర నగర్ 1 నుంచి 21 వీధులు, న్యూ కాలని 1 నుంచి 4 వీధులు, కొట్టివాక్కం కుప్పం, ఈసీఆర్ రోడ్డు మరుందీశ్వర ఆలయం నుంచి నీలాంకరై కుప్పం వరకు, వర్శిటీ నగర్, ఈస్ట్ శాస్త్రి నగర్, నార్త్, సౌత్ మాడ వీధులు, రంగస్వామి అవెన్యూ, సీవాట్ రోడ్డు 1 నుంచి 4 వీధులు, బాలకృష్ణ హైరోడ్డు, వాల్మీకి నగర్, కళాక్షేత్ర రోడ్డు, సీబీఐ కాలని, పోలీస్ క్వార్టర్స్, తిరువీధి అమ్మన్ ఆలయ వీధి.

## నీట్ నుంచి రాష్ట్రానికి మినహాయింపు ఇవ్వాల్సిందే

● మంత్రి రఘుపతి



పెరంబూర్, సెప్టెంబరు 20: నీట్‌కు సంబంధించి కేంద్రప్రభుత్వం నాలుగు సార్లు లేఖలు రాసిందని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాధానం చెప్పిన నేపథ్యంలో, నీట్ మినహాయింపు ఇవ్వాల్సిన పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి తప్పకుండా ఏర్పడుతుందని న్యాయశాఖ మంత్రి రఘుపతి తెలిపారు. సచివాలయంలో పీజీ లా కోర్సుల్లో చేరిన విద్యార్థులకు అడ్మిషన్లు ఉత్తర్వులను శుక్రవారం మంత్రి రఘుపతి అందజేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసిన పంపిన నీట్ మినహాయింపు తీర్మానంపై రాష్ట్రపతి కార్యాలయం నుంచి మానవవనరుల శాఖ, ఆరోగ్య శాఖల వివరణ కోరుతూ లేఖ రాశారని తెలిపారు. ఈ వ్యవహారంలో హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రప్రభుత్వానికి ఇప్పటివరకు నాలుగు సార్లు లేఖలు రాసిందన్నారు. ఈ విషయమై అన్ని ప్రశ్నలకు వివరణ ఇస్తూ కేంద్ర ప్రభుత్వానికి పంపించామని తెలిపారు. దీంతో, నీట్ నుంచి రాష్ట్రానికి మినహాయింపు కల్పించాల్సిన పరిస్థితి కేంద్ర ప్రభుత్వానికి వచ్చిందన్నారు. త్వరలో ఢిల్లీ వెళ్లనున్న ముఖ్యమంత్రి, నీట్ మినహాయింపుపై ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేయనున్నారని మంత్రి రఘుపతి అన్నారు.

## రూ.7వేల కోసం చిన్నారుల బలి

● స్నేహితుడి కుమారులను హతమార్చిన వైనం

ప్యారీస్, సెప్టెంబరు 20: అప్పుగా తీసుకున్న రూ.7,000 తిరిగివ్వని స్నేహితుడి ఇద్దరు కుమారులను కిడ్నాప్ చేసి హతమార్చిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు. గుడియాత్తం సమీపంలోని సింగిల్‌బాడి ఎరుపట్టి గ్రామానికి చెందిన భవన నిర్మాణ సంస్థ కాంట్రాక్టర్ వసంతకుమార్ (25), ఆంబూరు సమీపంలోని మాధనూరు వడివేల్‌నగర్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు యోగరాజ్ స్నేహితులు. గత ఏడాది వివాహం చేసుకున్న వసంతకుమార్ విబేధాల కారణంగా భార్యకి దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో, గురువారం సాయంత్రం యోగరాజ్ ఇంటికి వెళ్లిన వసంతకుమార్ ఆయన కుమారులు యోగిత్ (5), దర్శన్ (4)లను దుకాణానికి తీసుకెళ్తానని చెప్పి కొన్ని గంటలు గడిచినా తిరిగిరాలేదు. దీంతో వసంతకుమార్ సెల్‌ఫోన్‌కు యోగరాజ్ కాల్ చేస్తే అది స్విచ్ఛాఫ్ వచ్చింది. తన కుమారుల కోసం పలు ప్రాంతాల్లో గాలించినా జాడ తెలియకపోవడంతో ఆంబూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వసంతకుమార్ సెల్‌ఫోన్ నెంబరు పరిశీలించిన పోలీసులు, అతను సింగిల్‌బాడి ఏరిపట్టి ప్రాంతంలో ఉన్నట్లు తెలిసింది. అక్కడకు చేరుకున్న పోలీసులు, ఇద్దరు చిన్నారులు శవమై పడి ఉండడం చూసి స్వాధీనం చేసుకొని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసుల ప్రాథమిక విచారణలో... వసంతకుమార్ వద్ద యోగిరాజ్ రూ.14,000 అప్పుగా తీసుకొని రూ.7,000 మాత్రమే తిరిగి చెల్లించడంతో, డబ్బులు విషయమై పలుమార్లు యోగరాజ్‌ను అడిగినా అతడి నుంచి సరైన సమాధానం లేకపోవడం, మరోవైపు భార్య వెళ్లిపోవడంతో ఆగ్రహంతో ఉన్న వసంతకుమార్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తెలిసింది.

## తిరువణ్ణామలై మఠంలో యువతి శవం

● యువకుడి కోసం గాలింపు

అడయార్, సెప్టెంబరు 20: ప్రసిద్ధపుణ్యక్షేత్రం తిరువణ్ణామలైలోని ఒక మఠంలో యువతి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆమెతో పాటు మఠంలో బస చేసిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. తిరువణ్ణామలైలోని ఆనైకట్టి అనే ప్రాంతంలో ప్రైవేటు వ్యక్తులకు చెందిన మఠం ఉంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువతీ యువకులు భార్యాభర్తలమని చెప్పి, గది అద్దెకు తీసుకున్నారు. గురువారం సాయంత్రం వరకు వారి గది తలుపులు తెరవకపోవడంతో అనుమానించిన మఠం నిర్వాహకులు... కిటికీల్లోని చూడగా, యువతి ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. వెంటనే రెండో పట్టణ పోలీసులకు సమాచారమివ్వగా, వారు వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతురాలిని ఏపీలోని గుంటూరుకు చెందిన మౌనిక (24)గా గుర్తించారు. అయితే, ఆమెతో కలిసి గదిలో బస చేసిన యువకుడు మాత్రం కనిపించలేదు. దీంతో అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## 75 యేళ్ల వృద్ధురాలిపై హత్యాచారం

● మనవడి అరెస్టు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో 75 యేళ్ల బామ్మపై అత్యాచారం జరిపి హతమార్చిన మనవడిని పోలీసులు అరెస్టు చేశారు. ఎడప్పాడి సమీపం ఓ ఇంటిలో వళ్ళియమ్మాళ్ (75) అనే వృద్ధ వితంతువు నివసిస్తోంది. శుక్రవారం ఉదయం ఇంటిలో వంటినిండా గాయాలతో ఆమె శవంగా పడి ఉండటం చూసి స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎడప్పాడి పోలీసులు వెళ్ళి విచారణ జరిపినప్పుడు వళ్ళియమ్మాళ్ మనవడు విఘ్నేష్ (22) తాగిన మైకంలో ఇంటికొచ్చి ఆమెపై అత్యాచారం జరిపాడని, ఆమె కేకలు పెట్టడంతో హతమార్చినట్లు వెల్లడైంది. పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు.

## రీల్స్ కోసం తరగతి గదిలో బాలికకు సీమంతం

● ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): వేలూరు కాంగేయనల్లూరు ప్రభుత్వ బాలికల పాఠశాలలో రీల్స్ కోసం ఓ బాలికకు తోటి విద్యార్థులు శీమంతం జరిపారు. ఆ వీడియో సామాజిక ప్రసార మాధ్యమాల్లో వెలువడి తీవ్ర కలకలం సృష్టించింది. వేలూరు విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ సంఘటనపై విచారణ జరిపి శీమంతం జరిగిన క్లాస్ టీచర్ చాముండేశ్వరిని సస్పెండ్ చేశారు. ఈ సంఘటనపై ప్రధానోపాధ్యాయురాలు ప్రేమకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఈ సంఘటన దరిమిలా వేలూరు జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లో కొని నిబంధనలు పాటించేలా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు విద్యార్థులను సెల్‌ఫోన్లతో అనుమతించకూడదని, వారి వెంట కత్తి తదితర మారణాయుధాలు ఇతర పరికరాలు తీసుకురాకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థుల సంచులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పేర్కొన్నారు. లంచ్‌టైమ్‌లో క్లాస్ టీచర్లు తరగతి గదులలోనే భోంచేయాలనే నిబంధన కూడా విధించినట్లు ప్రధాన విద్యాధికారి మణిమొళి పేర్కొన్నారు.

## కోర్కెల సాధనకు ఉద్యోగుల ఆందోళన



ధర్నాలో ప్రభుత్వ ఉద్యోగులు

వేలూరు, సెప్టెంబరు 20: కొత్త పించన్ విధానం రద్దు, మధ్యాహ్న భోజనం, అంగన్వాడీ, రెవెన్యూ గ్రామ అధికారులు, లైబ్రేరియన్లు సుమారు 3 లక్షల ఉద్యోగాల క్రమబద్ధీకరణ సహా 11 డిమాండ్ల సాధనకు ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు జోషి అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో, జిల్లా సెక్రటరీ వేలు, రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం సెక్రటరీ రమేష్, టెక్నికల్ విద్య ఉపాధ్యాయుల సంఘం మాజీ అధ్యక్షుడు జనార్థనన్, విద్యాశాఖ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు శేఖర్, నిర్వాహకులు దీనదయాళన్, ఎయిల్ సహా 100 మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు.

## 'క్లీన్ ఇండియా' అవగాహన ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

వేలూరు, సెప్టెంబరు 20: వలవనూర్ పంచాయతి ప్రభుత్వ పాఠశాలలో ఏపీజే ట్రస్ట్ తరఫున 'క్లీన్ ఇండియా' అవగాహన ప్రతిజ్ఞ శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు గోపి, తిమిరి బీడీవో వెంకటేశన్, మహమ్మద్ సహి ఉద్దీన్, పంచాయతి అధ్యక్షుడు శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరళ, ఉపాధ్యాయుడు కృపానందన్, ట్రస్టీ నిర్వాహకులు తనిగై, మణికంఠన్, తమిళ్, గౌతమన్, విఘ్నేశ్వరన్, కుమరేశన్, కపిలన్, గిరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలైట్ టాస్మాక్ దుకాణం మూసివేత



ప్రజలకు స్వీట్లు అందజేస్తున్న గోపి

వేలూరు, సెప్టెంబరు 20: స్థానిక కాగితపుపట్టరైలోని ఎలైట్ టాస్మాక్ దుకాణం మూతపడింది. ఈ ప్రాంతంలోని దుకాణంతో తరచూ ట్రాఫిక్ సమస్యలతో పాటు మద్యం తాగిన వారు ఆగడాలకు పాల్పడుతున్నారు. ఈ విషయమై ఎండీఎంకే అధ్యక్షుడు గోపి పెట్టిన పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, దుకాణం మూసివేయాలని ఉత్తర్వులు జారీచేసింది. దీంతో, దుకాణం మూసివేస్తున్నట్లు టాస్మాక్ అధికారులు ప్రకటించారు. దీంతో, ఆ ప్రాంత ప్రజలకు గోపి స్వీట్లు పంపిణీ చేశారు.



తన బంధువులు, చుట్టుపక్కల వారు పడుతున్న అవస్థ చూసి చలించిపోయిందో యువతి. క్యాన్సర్ బాధితులకు ఎంత చేసినా వారి నష్టం పూడ్చడం కష్టమని గ్రహించి అలాంటి వారికి అండగా నిలుస్తోంది డైసీ రాణి. తండ్రి నుంచి వచ్చిన వారసత్వాన్ని అందిపుచ్చుకుని, కుటుంబ సభ్యుల సాయంతో ఏకంగా ఓ ఫౌండేషన్ స్థాపించి తనకు చేతనైనంత సాయం చేస్తూ అందులోనే సంతృప్తి పొందుతున్నా రామె. సామాజిక సేవలో రాణిస్తున్న డైసీ ప్రస్థానం నేటి తరుణిలో...

- పెరంబూర్

ఆపన్నులకు సాయం...

# ఎనలేని ఆత్మవిశ్వాసం

● క్యాన్సర్ రోగులకు ధైర్యాన్నిచ్చే డైసీ రాణి







సేవా పురస్కారం అందుకుంటూ.. - క్యాన్సర్ కుటుంబానికి ఉపాధి కల్పనలో...

### 'జోమన్ ఫౌండేషన్'...

సాధారణ జ్వరం, జలుబు, దగ్గు తదితర జబ్బులకు పేదలు, ధనవంతులు అనే తారతమ్యాలుండవు. తమ వారిని కాపాడుకోనేందుకు శక్తికి మించి ప్రయత్నిస్తున్న వారెందరో ఉన్నారు. తాము దాచుకున్న ధనమంతా వైద్యం కోసం వెచ్చిస్తున్నారు. అది కూడా చాలక బంధువులు, స్నేహితులు, తెలిసిన వారి సాయం తీసుకున్నా, అవి కూడా సరిపోకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతం. అలాంటి సమయాల్లో వారికి జీవితమంటే విరక్తి పుడుతోంది. అలాంటి సమయంలో నేనున్నాననే నమ్మకం ఎవరైనా కలిగిస్తే బాగుంటుందని వారు ఎదురుచూస్తుంటారు. అలాంటి నమ్మకం వారికి కల్పించాలని నేను నిర్ణయించుకున్నాను. ముఖ్యంగా, క్యాన్సర్ కారణంగా బాధపడే కుటుంబాలకు సహాయం చేయాలనుకున్నాను. అందుకు నా తమ్ముడు కూడా నాకు అండగా నిలిచాడు. నేను, నా తమ్ముడు విజయకుమార్ కలసి 2016లో 'జోమన్ ఫౌండేషన్' అనే ఓ స్వచ్ఛంద సంస్థ ప్రారంభించి, దాని ద్వారా సహాయాలు అందిస్తున్నాము. క్యాన్సర్‌తో బాధపడుతున్నవారు, వారి కుటుంబ సభ్యులను స్వయంగా కలుసుకొని వారికి అవసరమైన సహాయాలు అందిస్తున్నాము.

తరుణి

### ఉపాధి కల్పించాలి....

క్యాన్సర్‌కు గురైన వారిలో అధిక శాతం ఆ వ్యాధి తీవ్రత కారణంగా మృతిచెందుతుండగా, ఒకరిద్దరు మాత్రమే ఈ వ్యాధి నుంచి బయటపడుతున్నారు. క్యాన్సర్ బాధితులకు డబ్బు అధికంగా ఖర్చుచేసిన కుటుంబాలు మళ్లీ సాధారణ స్థితికి రావాలంటే ఆ కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అది వారికి ఎంతో సహాయంగా ఉంటుంది. కేవలం డబ్బు మాత్రమే అందజేయడమే కాకుండా, వారు జీవితంలో స్థిరపడేలా ఏర్పాటుచేస్తే, వారిలో ఆత్మస్థైర్యం కలుగుతుంది. అలా కష్టాల్లో ఉన్న వారికి చేయూతనందించడం మన మనస్సుకు ఎంతో సంతృప్తి ఇస్తుందని తన మనోభావాలను తరుణితో పంచుకున్నారు.



అపన్న హస్తం...

### నాన్నే మార్గదర్శకులు...

నా స్వగ్రామం పుదుకోట. వివాహమైన తర్వాత చెన్నైలో నివసిస్తున్నాను. మా తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. ఆయనకు సేవా దృక్పథం ఎక్కువ. అందువల్ల ఆయన సంపాదనలో తోచినంత సహాయం చేస్తుంటారు. ఆయన కొందరు సమాజ శ్రేయోభిలాషులతో కలసి, అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. దారి తప్పి వచ్చిన వారికి మా ఇంట్లోనే ఆశ్రయం కల్పిస్తుంటారు. ఆకలి అన్న వారికి ఆహారం అందజేస్తుంటారు. సహాయం కోసం ఎవరు వచ్చినా కాదనరు. చేతనైంత సహాయం చేస్తుంటారు. ఆయన సేవలను చూస్తూ నేను పెరిగాను. అందువల్ల చిన్నతనం నుంచే నాకు మరొకరికి సాయం చేయాలని కోరిక కలిగింది. నేను కూడా నాన్నలాగా నాకు చేతనైనంత సహాయాలు అందజేస్తున్నాను. నాన్న నాతో తరచూ 'ఎవరైనా సహాయం అని వస్తే నీ చేతనైనంత సాయం చేయడం పెద్ద విషయం కాదు. మనవల్ల సాధ్యం కాదనే మాటను దాటి వారిని ఆదుకోవాలి' అనే చెప్పేవారు. ఆ మాటలు నా మనస్సులో బలంగా నాటుకుపోయాయి. అందువల్ల నేను, నాకు తెలిసిన వారిని కలుపుకొని సహాయాలు చేస్తున్నాను.

### కలచివేసిన ఘటన...

చదువు, వివాహం, ఉద్యోగం అంటూ జీవితం కొనసాగిపోతున్నఆ సమయంలో ఆ ఘటన చోటు చేసుకుంది. మా బంధువుల్లో సోదరుడి వరుసయ్యే ఓ యువకుడు చలాకీగా ఉంటాడు. ఒకరోజు నేను అతడిని ఆస్పత్రిలో చూశాను. అప్పుడు తెలిసింది, ఆ యువకుడు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని. చికిత్స కోసం అతను చాలా రోజులు ఆస్పత్రిలో ఉన్నాడు. దాచుకున్న డబ్బంతా వైద్యం కోసం అయిపోయింది. ఏం చేద్దామని అతడి భార్యకు సంకటస్థితి ఏర్పడింది. వారిద్దర్నీ చూసి ప్రశాంతంగా ఉండలేకపోయాను. ఆ సమయంలో ఆమె దగ్గరున్న డబ్బును ఖర్చులకోసం ఆమె చేతుల్లో ఉంచాను. కానీ, నేను ఇచ్చిన డబ్బు వైద్య ఖర్చులకే సరిపోయేది కాదని తెలుసు. అందువల్ల నాకు తెలిసిన వారిని సంప్రదించి వారు తోచినంత డబ్బు అందించేలా కృషిచేశాను. కానీ, కొద్దిరోజుల్లో సోదరుడు మృతిచెందడం నాకు ఎంతో బాధ కలిగించింది. అదే సమయంలో, అతని చివరి రోజుల్లో నాకు చేతనైనంత సహాయం ఆ కుటుంబానికి అందజేసి వారికి చేయూత అందించానన్న ఆత్మసంతృప్తి కలిగినా, అతడి మృతి నాకు ఎంతో మనోవేదన కలిగించింది.

## యంగ్ పాత్రలకు ప్రాధాన్యం

● బ్రిగిడ



ఇకపై తాను నటించే చిత్రాల్లో యంగ్ పాత్రలను పోషించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తానని హీరోయిన్ బ్రిగిడ అన్నారు. 'అయోగ్య', 'వేలన్', 'ఇరవిన్ నిళల్', 'గరుడన్' వంటి అనేక చిత్రాల్లో నటించిన బ్రిగిడ... కోలీవుడ్ ప్రేక్షకుల్లో మాత్రం టీవీ టీచరుగా గుర్తిండిపోయారు. ఈ నేపథ్యంలో ఆమె హీరోయిన్‌గా నటించిన 'కోళిపన్నై చెల్లదురై' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'నాకు 30 యేళ్ళు నిండినట్టు భావించి ఎంతో బాధపడుతున్నారు. టీవీ టీచర్ పాత్రలో నటించే సమయంలో నా వయసు 19 యేళ్ళు మాత్రమే. ఆ తర్వాత నేను పోషించిన పాత్రలన్నీ ఎంతో మెచ్యూరిటీతో కూడుకున్నవి. ఆ పాత్రలకు తగినట్టుగా నా బాడీ లాంగ్వేజ్, నా ప్రవర్తన కూడా మార్చుకున్నాను. దీంతో ప్రతి ఒక్కరూ నాకు వయసు ఎక్కువ అంటూ కామెంట్స్ చేయసాగారు. ఇపుడు శీను రామస్వామి దర్శకత్వంలో వచ్చిన 'కోళిపన్నై చెల్లదురై' చిత్రంలో యంగ్‌గా కనిపించాను. ఇకపై ఇలాంటి పాత్రలనే ఎంచుకుని నటిస్తాను' అని పేర్కొన్నారు.

## ప్రభుదేవా హీరోగా 'పేట రాప్'

ఆడియో రిలీజ్



వేదిక, ప్రభుదేవా, సన్నిలియోన్

ప్రభుదేవా, వేదిక, సన్నిలియోన్ తదితరులు నటించిన 'పేట రాప్' చిత్రం ఆడియో, ట్రైలర్ గురువారం రాత్రి విడుదల చేశారు. బ్లూ హిల్ ఫిలిమ్స్ పతాకంపై జోబి బి శ్యామ్ నిర్మాణంలో ఎస్‌జే శీను దర్శకత్వంలో ఈ చిత్రం రూపుదిద్దుకుంది. ఇతర పాత్రల్లో షైమ్ గోపి, రమేష్ తిలక్, భగవతి పెరుమాళ్, వివేక్ ప్రసన్న, రియాజ్ ఖాన్, రాజీవ్ పిళ్ళై, జయప్రకాష్ తదితరులు నటించారు. జీత్తు దామోదరన్ ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రాన్ని డి.ఇమ్మాన్ సంగీత స్వరాలు సమకూర్చారు. ఫుల్‌లెంగ్త్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కగా ఈ నెల 27న సఫైర్ స్టూడియో ఈ చిత్రాన్ని రాష్ట్రంలో విడుదల చేయనున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను మొదలుపెట్టింది. ఇందులో భాగంగా, గురువారం రాత్రి ఈ సినిమా ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత జోబి బి శ్యామ్ మాట్లాడుతూ, 'నా వ్యాపారాన్ని 2000లో తమిళనాడు రాష్ట్రం నుంచే ప్రారంభించాను. ఇపుడు తమ బ్యానరుపై తొలి చిత్రాన్ని తమిళంలోనే నిర్మించాం. ఈ సినిమా కోసం శ్రమించిన ప్రతి ఒక్క నటీనటులకు ధన్యవాదాలన్నారు. దర్శకుడు ఎస్‌జే శీను మాట్లాడుతూ, 'రెండేళ్ళ క్రితం ప్రభుదేవాకు కథ వివరించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ ఆడియో రిలీజ్ వేడుక కోసం వేయి కళ్ళతో ఎదురు చూశాను. నా కల ఇప్పటికి నిజమైంది. హీరో ప్రభుదేవా అన్ని రంగాల్లో సీనియర్ అయినప్పటికీ.. ఒక కొత్త దర్శకుడికి అన్నివిధాలా సహకరించి సినిమా పూర్తి చేశారు. మీడియా కూడా సపోర్టు చేయాలని ఆయన కోరారు. హీరో ప్రభుదేవా మాట్లాడుతూ, 'ఈ సినిమా షూటింగ్ ఎంతో ఆహ్లాదకరంగా సాగిపోయింది. రమేష్ తిలక్, వివేక్ ప్రసన్న, బక్స్, వయ్యాపురి, జేపీ తదితరులతో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది. సంగీత దర్శకుడు ఇమ్మాన్ ఇప్పటికే తన ప్రతిభను నిరూపించుకున్నారు. కానీ, ఆయన నాకు మాత్రం ఒక జెంటిల్‌మేన్‌గా కనిపించారు. కుటుంబ సభ్యులంతా కలిసి ఎంజాయ్ చేస్తూ చూసేలా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించాం' అని పేర్కొన్నారు. హీరోయిన్లు వేదిక, సన్నీ లియోన్, మ్యూజిక్ డైరెక్టర్ ఇమ్మాన్ తదితరులు ప్రసంగించారు.

## 'పరారీ'పై సంగీత కళ్యాణ్ గంపెడాశలు



సంగీత కళ్యాణ్ కుమార్

రాజు మురుగన్ నిర్మాణ సారథ్యంలో ఎళిల్ పెరియవాడి దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'పరారీ'. హీరోయిన్‌గా సంగీత కళ్యాణ్ కుమార్. విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ చిత్రంపై ఆమె గంపెడాశలు పెట్టుకుంది. విజువల్ కమ్యూనికేషన్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన సంగీత.. చిత్రపరిశ్రమలో మంచి నటిగా పేరు తెచ్చుకోవాలని ఉవ్విళ్ళూరుతోంది. ఈ విషయంపై ఆమె స్పందిస్తూ, 'నటి అంటే కేవలం హీరోయిన్‌గా మాత్రమే రాణించాలని లేదు. మంచి పాత్రలు వచ్చినపుడు వాటి ద్వారా కూడా వెండితెరపై మన ప్రతిభ నిరూపించుకోవచ్చు. వెట్రిమారన్, సెల్వరాఘవన్, సుధా కొంగర, లోకేష్ కనకరాజ్, మారి సెల్వరాజ్ వంటి దర్శకులు అనేక మంది నటీమణులకు ఎన్నో మంచి ప్రామిసింగ్ పాత్రలు అందించారు. అలాంటి దర్శకులతో కలిసి పనిచేయాలని వుంది. 'గార్గి', 'మహానటి', 'అరుంధతి', 'సీతారామం' వంటి చిత్రాల్లోని హీరోయిన్ పాత్రల్లో నటించాలని వుంది. ఈ సినిమాలు పాతవి కావొచ్చు.. కానీ ఇందులోని పాత్రలు జీవితకాలం గుర్తిండిపోతాయి' అని పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

## ప్లీజ్... పాలిటిక్స్‌పై ప్రశ్నలు అడగొద్దు

● రజనీకాంత్



సూపర్‌స్టార్ రజనీకాంత్ మీడియాపై అసహనం వ్యక్తం చేశారు. రాజకీయాల గురించి తనను ప్రశ్నించవద్దని గతంలోనే చెప్పానని, కానీ, మీడియా ఇవేమీ పట్టించుకోకుండా పదేపదే పాలిటిక్స్ గురించి ప్రశ్నలు వేస్తున్నారంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా నటించిన చిత్రం 'వేట్టయన్'. వచ్చే నెల పదో తేదీ విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ఆ చిత్ర ఆడియో విడుదల చేశారు. ఈ వేడుకలో పాల్గొనేందుకు వైజాగ్‌లో 'కూలి' షూటింగ్ నుంచి చెన్నై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'వేట్టయన్' చిత్రం బాగా వచ్చింది. 'కూలి' సినిమా షూటింగ్ సాఫీగా సాగుతుంది. రాజకీయాలకు సంబంధించిన విషయాలపై నన్ను అడగవొద్దని గతంలో చెప్పాను. కానీ, మీడియా రాజకీయాలపైనే ప్రశ్నలు వేస్తున్నారు' అంటూ అసహనం వ్యక్తం చేశారు. కాగా ఉదయనిధిని తమిళనాడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా నియమించనున్నారంటూ సాగుతున్న ప్రచారంపై స్పందన ఏంటని ప్రశ్నింగా, రజనీకాంత్ పై విధంగా అన్నారు.

## అపోలో ఆస్పత్రిలో 'పింక్ బుక్'



'పింక్ బుక్' ఆవిష్కరిస్తున్న తేన్‌మొళి తదితరులు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అపోలో హాస్పిటల్ నిర్వాహకులు ఆస్పత్రి పరిసరాల్లో రోగులు, సందర్శకుల భద్రతను నిర్ధారించడానికి అనువుగా 'పింక్ బుక్' రూపొందించింది. ఆస్పత్రి ప్రాంగణంలో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో ఆ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి, ఐపీఎస్ అధికారి తేన్‌మొళి, సిందూరి రెడ్డి, విద్యాశంకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీతారెడ్డి మాట్లాడుతూ అపోలో ఆస్పత్రులు ఎల్లప్పుడూ రోగుల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపడుతుందని చెప్పారు. ఈ పింక్ బుక్ ఆస్పత్రి పరిసరాలకు సంబంధించి సమగ్రమైన వివరాలు, ఆయా ప్రాంతాల్లో రోగులు పాటించాల్సిన నియమాలు, ఆపద సమయాల్లో సిద్ధంగా ఉండే భద్రతా సిబ్బంది వివరాలు ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు తెలిపారు.

## మార్కెట్లోకి కొత్త ఎస్‌యూవీ 'థార్ రాక్స్'



థార్ రాక్స్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంపీఎల్ సీఈఓ రాజేష్, ఎమ్మెల్యే మోహన్, సినీ దర్శకుడు చేరన్ తదితరులు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాల తయారీలో ప్రసిద్ధిగాంచిన మహేంద్ర కంపెనీ 'థార్ రాక్స్' పేరుతో కొత్త ఎస్‌యూవీని మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. నగరంలోని ఆటోమోటివ్ మాన్యుఫాక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంపీఎల్) ఈ కొత్త వాహనాన్ని నగర ప్రముఖులు, సుమారు 300 మంది కస్టమర్ల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ కొత్త వాహనం ప్రారంభ ధర రూ.12.99 లక్షలని సంస్థ నిర్వాహకులు ప్రకటించారు. ఈ వాహనాల బుకింగ్స్ అక్టోబరు 3 నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంపీఎల్ సంస్థ సీఈఓ రాజేష్, శాసనసభ్యుడు ఎంకే మోహన్, సినీ దర్శకుడు చేరన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## 'ఐసిఎఫ్'కు ఛేంజ్ మేకర్ అవార్డు

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైలు పెట్టెల తయారీ సంస్థ 'ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ' (ఐసీఎఫ్)కి 'ఛేంజ్‌మేకర్' అవార్డు వరించింది. ఇటీవల జరిగిన ది హిందూ బిజినెస్ లైన్ ఛేంజ్‌మేకర్ అవార్డ్స్-2024 కార్యక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఐసీఎఫ్‌కు 'ఛేంజ్ మేకర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు అందజేశారు. అదేవిధంగా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్, యంగ్ ఛేంజ్ మేకర్, ఐకానిక్ ఛేంజ్ మేకర్, ఛేంజ్ మేకర్ ఆఫ్ ద ఇయర్, ఛైర్‌పర్సన్స్ అవార్డ్ అనే ఏడు విభాగాల కింద నిర్వాహకులు అవార్డులను బహూకరించారు.

## ట్రిప్లికేన్‌లో చేపల మార్కెట్, ఇండోర్‌స్టేడియం

● ప్రారంభించిన మంత్రి ఉదయనిధి



చేపల మార్కెట్ ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రి ఉదయనిధి

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో ట్రిప్లికేన్, నడుకుప్పం ప్రాంతాల్లో పునర్నిర్మిత చేపలమార్కెట్, ఇండోర్ టెన్నిస్ స్టేడియంను రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి శుక్రవారం ఉదయం ప్రారంభించారు. నడుకుప్పం వద్ద ఉన్న చేపల మార్కెట్‌ను రూ.26.42 లక్షలతో పునర్నిర్మించారు. ఈ మార్కెట్‌లో ఇనుప మెట్లు, చేపలను శుభ్రపరిచే గదులు, మురుగునీటి కాల్వల సదుపాయం కల్పించినట్లు మంత్రి ఉదయనిధి ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం నడుకుప్పం ప్రాంతంలో నమక్కునామే పథకం కింద, చైల్డ్ లైఫ్ ఎన్జీవో సంస్థ సహకారంతో రూ.41 లక్షలతో నిర్మించిన వాలీబాల్ మైదానం, క్యారమ్‌బోర్డు, టేబుల్ టెన్నిస్ ఇండోర్ మినీ స్టేడియంను కూడా మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ ఆర్.ప్రియ, ఎంపీ దయానిధి మారన్, డిప్యూటీ మేయర్ ఎం. మహేష్ కుమార్, కమిషనర్ జె కుమారగురుబరన్, స్టాండింగ్ కమిటీ (ప్రజాపనులు) ఛైర్మన్ ఎన్.సిట్రరసు, చైల్డ్ లైఫ్ ఎన్జీవో సంస్థ వ్యవస్థాపకురాలు శాంతి రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.



రాయపేటలో మాజీ మంత్రి అన్బళగన్ సోదరి రాజం రామదాస్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, మంత్రులు తదితరులు



గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో ట్రిప్లికేన్ నడుకుప్పంలో నిర్మించిన ఇండోర్‌స్టేడియంను ప్రారంభించి మేయర్ ప్రియతో టెన్నికాయిట్ ఆడుతున్న మంత్రి ఉదయనిధి

## మాతృభాష ఔన్నత్యాన్ని చాటిచెప్పండి

● తెలుగు తరుణి వేడుకల్లో డా.కల్పన



కల్పనను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, సెప్టెంబరు 20: భావితరాలకు మాతృభాష ఔన్నత్యాన్ని చాటిచెప్పాలని డీఆర్‌బీసీసీసీ హిందూ కళాశాల తెలుగు శాఖ సహాయాచార్యులు డా.తుమ్మపూడి కల్పన పిలుపునిచ్చారు. ఎగ్మూర్‌లోని తెలుగు తరుణి సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కల్పన ప్రసంగిస్తూ... తెలుగు మీడియం చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలున్నాయన్నారు. తెలుగు భాష నేర్చుకుంటే ప్రపంచ భాషలను సులభంగా నేర్చుకోవచ్చని, ఈ మంచి అవకాశం ఒక్క తెలుగు వారికి మాత్రమే దక్కిందని అభిప్రాయపడ్డారు. తెలుగు భాష వాడుకను ముందు తెలుగింటి పిల్లలకు తల్లిదండ్రులు నేర్పించాలని, భావితరాలకు మాతృభాష ఔన్నత్యాన్ని చాటాలని ఆమె పిలుపునిచ్చారు. తెలుగు తరుణి సంస్థ అధ్యక్షురాలు కె.రమణి సారథ్యం వహించిన ఈ వేడుకల్లో కార్యదర్శి దేవసేన, ట్రజరర్ మాజేటి అపర్ణ, శైలజ తదితరులు కల్పనను ఘనంగా సత్కరించారు.

## డాక్టర్ సంజీవరెడ్డికి జీవనసాఫల్య పురస్కారం



డాక్టర్ సంజీవరెడ్డికి పురస్కారం ప్రదానం చేస్తున్న వీఆర్ వెంకటాచలం

చెన్నై, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరామచంద్ర మెడికల్ వైద్య కళాశాల వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు ప్రతిభావంతులైన విద్యార్థులకు స్వర్ణ పతకాలు, విశేష సేవలందించిన వైద్యనిపుణులకు, వర్శిటీ సిబ్బందికి పురస్కారాలను ప్రదానం చేశారు. వర్శిటీ ఛాన్స్‌లర్ వీఆర్ వెంకటాచలం, ప్రొ ఛాన్స్‌లర్ ఆర్‌వీ సెంగుట్టువన్ ఈ అవార్డులను అందజేశారు. ప్రముఖ వైద్యులు, కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.సంజీవరెడ్డికి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయగా, డాక్టర్ ఎ.రవి, ప్రొఫెసర్ ఎస్.వెంకటేష్, డి.లక్ష్మీనారాయణన్, వి.జీవానందంలకు ఔట్ స్టాండింగ్ సర్వీస్ అవార్డు అందించారు. అదేవిధంగా ఎంబీబీఎస్ విద్యార్థులు పీఆర్ వీణ, సంజన.వి నాలుగు స్వర్ణ పతకాలు అందుకోవడం విశేషం. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ జేఎస్ఎన్ మూర్తి, ఫౌండర్ ఛాన్స్‌లర్ ఎన్‌పీవీ రామస్వామి ఉడయార్, వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ ఉమా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.